
పరుగుల రాజు



సంకల్పం ఉంటే లక్ష్యసాధనకు వయసు అడ్డంకి కాదని నిరూపించాడు ఆ నవ యువకుడు. 70 ఏళ్లకు చేరువలో ఉన్నా పరుగు ఆపలేదు. పోటీ ఏదైనా ట్రాక్‌లో దిగితే ట్రోఫీ దక్కాల్సిందే.. ఆయన సంకల్పం ముందు మైదానం చిన్న బోవాల్సిందే.. మెడలో మెడల్ పడాల్సిందే..అలా జాతీయ స్థాయి పోటీల్లో సైతం సత్తాచాటి పరుగుల రాజుగా గుర్తింపు పొందారు ఈ వెటరన్ ఆకుల కనకరాజు.

- 70 ఏళ్లకు చేరువైనా ఆగని పరుగు
- ట్రాక్‌లో దిగితే ట్రోఫీ దక్కాల్సిందే..
- ఆదర్శంగా నిలుస్తున్న ఆకుల కనకరాజు

నేను ఈ స్థాయిలో ఉండడానికి నా గురువు పక్కృతి అప్పారావు, తండ్రి ఆకుల రాజు కారణం . వారి స్ఫూర్తితో బాల్యం నుంచే క్రీడల్లో రాణిస్తున్నాను. నా శరీరం సహకరించే వరకూ పరుగు ఆపను. ఆ పరుగు వల్లే నేను ఇంత ఆరోగ్యంగా ఉన్నాను. నేటి యువత స్పోర్ట్స్‌లో రాణించి పుట్టిన ఊరుకు కీర్తి తెచ్చే విధంగా ఎదగాలన్నదే నా ఆకాంక్ష.

ఆకుల కనకరాజు, ఇందిరాకాలనీ

జాతీయ స్థాయి పోటీలకు సై

వచ్చే నెల 1,2,3 తేదీల్లో కేరళలో జరగనున్న జాతీయ స్థాయి పరుగు పందెం (వయసు 60 నుంచి 70 ఏళ్లు వారికి జరిగే) పోటీల్లో పాల్గొననున్నారు.

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ-1 ప్రాంతానికి చెందిన ఆకుల కనకరాజు పదో తరగతి వరకు (ఎస్ఎల్‌సీ) చదువుకున్నారు. ఐదో తరగతి చదువుతున్న రోజుల (1968) నుంచి రన్నింగ్,కబడ్డీ,ఫుట్‌బాల్, లాంగ్ జంప్,హై జంప్ అంటే మక్కువ పెంచుకున్నారు. దీంతో 1969లో స్కూల్ స్థాయిలో జరిగిన గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో పాల్గొని ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. నాటి నుంచి పదో తరగతి చదువు ముగిసే వరకు స్కూల్స్ గేమ్స్ స్థాయిలో ఆల్‌రౌండర్‌గా నిలుస్తూ వచ్చాడు.


స్పోర్ట్స్ కోటాలో కొలువు

రన్నింగ్,ఫుట్‌బాల్,లాంగ్ జంప్,హై జంప్‌లో అనేక బహుమతులు సాధించాడు. స్పోర్ట్స్‌లో ఉన్న ప్రతిభను గుర్తించి 1983లో విశాఖ సెంట్రల్ జైల్‌లో మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో ఎం.ఎస్.వో గా ఉద్యోగం పొందాడు. అప్పటి నుంచి జైల్ తరఫున రన్నింగ్, లాంగ్ జంప్,హై జంప్ పోటీల్లో పాల్గొని ఛాంపియన్‌గా నిలిచాడు. జైల్లో విధులు నిర్వహిస్తున్న నాటి నుంచి పదవీ విరమణ సమయం వరకు అనేక జిల్లా,రాష్ట్ర స్థాయిల్లో జరిగిన పోటీల్లో దాదాపు 350 వరకు గోల్డు మెడల్స్ సాధించాడు.

పరుగు ఏదైనా.. బంగారు పతకమే..

గతేడాది హైదరాబాద్‌లో జరిగిన పరుగు పందెంలో 100,200,400 మీటర్ల పరుగు పందెంలో మూడు బంగారు పతకాలు సాధించాడు. అలాగే గత వారం గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన 100,200,400 మీటర్ల పరుగు పందెంలో మూడు బంగారు పతకాలు సాధించాడు.


అతిథి చేతుల మీదుగా మెడల్ అందుకుంటున్న కనకరాజు


పరుగు పందెంలో వచ్చిన గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌తో ఆకుల కనకరాజు

క్లుప్తంగా

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం


హోమంలో పాల్గొన్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ దరి మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా చేపట్టిన పూజల్లో పారిశ్రామిక ప్రాంత నలుమూల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి సాయిబాబాను దర్శించుకుని తరించారు. బాబాకు పంచామృతాలతో క్షీరాభిషేకం చేపట్టారు.నాయకులు ఎం.చంద్రమౌళి,పూడి భాస్కర్‌రావు తదితరులు పాల్గొని హోమంలో పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం


విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకాన్ని ప్రారంభించినట్టు ఎమ్మెల్యే గణబాబు చెప్పారు. జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం బాలికల ఉన్నత ప్లస్ 2 పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన ప్రారంభించారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకు వచ్చి యవతను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ డీవీ రమేష్, హెచ్ఎం మజ్జూరి శ్రీను, నారిపిన్ని సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం జూనియర్ కళాశాలలో..

మల్కాపురం: ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించనున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం మల్కాపురం జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, నాయకులు అంగ దుర్గాప్రశాంతి, మజ్జి సోమేష్,రామ్మోహన్‌నాయుడు,కాకి పోలిరెడ్డి పాల్గొన్నారు.

మూడో అంతస్తు నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

- మృతుడిది జైపూర్ ప్రాంతం


మృతుడు శంకరరావు

అగనంపూడి: మంగళపాలెం జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలోని బహుళ అంతస్తు పై నుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన మాడుకొండ శంకరరావు (41) ఉపాధి కోసం తొమ్మిదేళ్ల కిందట విశాఖ వచ్చి పరవాడలోని ఫార్మాకంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. భార్య నాగమణితో కలిసి మంగళపాలెంలోని జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో నివాముంటున్నారు. శనివారం ఉదయం మేడపైకి వెళ్లి మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు కొండవాలు ప్రాంతమైన లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో అమ్మవారి పాదాలు ఎగువ ప్రాంతంలో రక్షణ గోడల నిర్మాణం చేస్తున్నట్టు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తెలిపారు. శనివారం జీవీఎంసీ అధికారులతో కలసి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. రక్షణ గోడలను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం సుసర్ల కాలనీ చంద్రమౌళీశ్వర ఆలయ సమీపంలో జరుగుతున్న సీసీ డ్రైన్ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామ కృష్ణ శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శులు రామ దేవి, సోఫియా తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ మహాజన సభ నేడు

సింహాచలం : అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మహాజన సభ ఆదివారం నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. ప్రియాగార్డెన్స్‌కి వెళ్లే మార్గంలో ఉన్న బృందావనం మండపంలో ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. సొసైటీ లావాదేవీలు, డివిడెండ్ల పంపిణీ, తదితర విషయాలపై సభ్యులతో చర్చిస్తామని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులంతా పాల్గొనాలని కోరారు.

గేదె అడ్డు రావడంతో అదుపు తప్పిన ద్విచక్రవాహనం

యువకుడికి గాయాలు


గాయపడిన యువకుడికి నీరు తాగిస్తున్న స్థానికులు

మల్కాపురం: ద్విచక్రవాహనాన్ని గేదె ఢీకొనడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. ఘటనకు సంబంధించిన వివరాలివి.. స్థానిక క్రాంతినగర్‌లో తల్లిదండ్రులతో నివాసముంటున్న విజయ్ హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం విధులకు వెళ్లిన విజయ్, మధ్యాహ్నం భోజనానికి వచ్చి తిరిగి విధులకు వెళ్తుండగా మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా గల సర్వీస్ రోడ్డులో అతని ద్విచక్ర వాహనానికి గేదె అడ్డుగా వచ్చింది. ఆ గేదె కొమ్ముతో విజయ్‌ను పొడిచేందుకు ముందుకు రావడంతో దాని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయాడు. దీంతో ఎడమ కాలిభాగంలో గాయమైంది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అటుగా వాహనాలేవీ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే యువకుడికి సపర్యలు చేశారు. ఆ సమయంలో ట్రాఫిక్ అధికారులు అక్కడే ఉన్నా పశువుల పెంపకందారుడిని మందలించడం గానీ, మరే ఇతర చర్యలు గానీ తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. సర్వీస్‌రోడ్లపై పశువులను నిర్లక్ష్యంగా విడిచిపెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

దివ్యాంగ విద్యార్థుల సంక్రాంతి సంబరాలు


శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యార్థిని

విశాఖ విద్య: జీవీఎంసీ 52 వ వార్డు మర్రి పాలెం వుడా లేఅవుట్ హెల్దీ వాకర్స్ గ్రీన్ బెల్ట్‌లో బుచ్చిరాజుపాలెం పినాకిల్ మానసిక దివ్యాంగ విద్యార్థులు సంక్రాంతి సంబరాలు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ మానసిక దివ్యాంగులైన చిన్నారులకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, హెల్దీ వాకర్స్ పార్క్ సభ్యులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఎంఈవో-2 దివాకర్


ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో టెన్త్ ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో-2 దివాకర్

కంచరపాలెం: పదోతరగతిలో ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని గోపాలపట్నం ఎంఈవో-2 దివాకర్ పేర్కొన్నారు. జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తి పంతులుపేట ఉన్నత పాఠశాలలో శనివారం పదోతరగతి విద్యార్థుల ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. తరగతులకు విద్యార్థులు హాజరు తక్కువగా ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి అందరూ ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతిరోజు ఉదయం-సాయంత్రం స్టడీ అవర్స్, పునశ్చరణ తరగతులకు క్రమం తప్పకుండా తమ పిల్లలను సమయానికి పంపాలని తల్లిదండ్రులను ఆయన కోరారు. టెన్త్‌తోనే భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు ఆయన సూచించారు. ప్రతి ఐదురుగు విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని హెచ్ఎం ఆర్. శ్రీనివాసరావుకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరుపట్టిక, రికార్డులు పరిశీలించారు.

సమష్టి కృషితో.. 22 ఏళ్లు



కేక్ కట్ చేస్తున్న మహిళలు

ఘనంగా జనతా కాలనీ మహిళా సేవా సంఘం వార్షికోత్సవం

గోపాలపట్నం: మహిళల సమష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది జనతా కాలనీ మహిళా సేవా సంఘం. కాలనీకి మౌలిక సదుపాయాల కల్పనలో కీలకపాత్ర పోషించి, కాలనీవాసుల ప్రశంసలందుకుంటోంది. జీవీఎంసీ 92వ వార్డు జనతా కాలనీ మహిళా సేవా సంఘం 22వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. కాలనీలో వేడుకగా నిర్వహించిన కార్యక్రమంలో ఇప్పటి వరకు తమ సంఘం సాధించిన ప్రగతి, భవిష్యత్ ప్రణాళికలపై సభ్యులంతా చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు ఎం.విమల మాట్లాడుతూ కాలనీలో రహదారులు, కాల్వల వంటివి మహిళలంతా కలసి సాధించుకున్నామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు ఇ.వెంకటలక్ష్మి, దాసరి శివలక్ష్మి, బి.రమాకుమారి, సత్యవతి, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ టోలిక్‌కు అధికార భాషా పురస్కారం


అవార్డు అందుకుంటున్న టోలిక్ మెంబర్ సెక్రటరీ లలన్‌కుమార్

ఉక్కునగరం: కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ అధికార భాషా పురస్కారాన్ని విశాఖ టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (టోలిక్)కు మూడో బహుమతిని ప్రకటించారు. కర్ణాటకలోని మైసూర్‌లో శనివారం నిర్వహించిన దక్షిణ-పశ్చిమ రాష్ట్రాల ప్రాంతీయ ఉమ్మడి అధికారిక భాషా సదస్సులో ఈ బహుమతి అందజేశారు. బిహార్ గవర్నర్ డాక్టర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్, మైసూర్ ఎంపీ యదువీర్ చామ్‌రాజ్ సమక్షంలో హోం మంత్రిత్వశాఖ అధికార భాషా శాఖ కార్యదర్శి అన్షులి ఆర్య చేతుల మీదుగా టోలిక్ మెంబర్ సెక్రటరీ, స్టీల్‌ప్లాంట్ హాస్పిటాలిటీ జీఎం డాక్టర్ లలన్ కుమార్ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

అంధకారంలో రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి


సింహాచలం రైల్వే స్టేషన్‌లో చంద్రనగర్‌కు వెళ్లే ఫుట్ ఓవర్ బ్రిడ్జ్


ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై సెల్‌ఫోన్ లైటింగ్‌లో వెళ్తున్న యువతి

గోపాలపట్నం: గోపాలపట్నం నుంచి చంద్రనగర్‌కు వెళ్లే రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై అంధకారం అలముకుంది. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో కళాశాలలు, ఉద్యోగాల నుంచి ఇంటికి వెళ్లే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ఆకతాయిల వల్ల ప్రమాదముందని వాపోతున్నారు. విద్యుత్ దీపాలు లేపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని... స్టేషన్‌లో రైల్వే అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెల్ ఫోన్ల వెళుతురులో రాకపోకలు సాగిస్తున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ బ్రిడ్జిపై విద్యుత్ దీపాలు వేయాలని కోరుతున్నారు.

ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం వైస్ చాన్సలర్ శశిభూషణరావును కలసి తమ సమస్యలను విన్నవించారు. ఆంధ్ర యూనివర్సిటీలో పని చేస్తున్న టువంటి అసిస్టెంట్ ప్రొఫెసర్ , కాంట్రాక్ట్ ప్రొఫెసర్లకు ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేయడం లేదని, కానీ అతిథి అధ్యాపకు కట్ చేయడం ఎంతవరకు సబబు అని తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ విషయంలో ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపు చేయకుండా, పూర్తి పారితోషకం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అతిథి అధ్యాపకుల అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దాస్ దేవా, శ్రీను, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ శిరీష్, డాక్టర్ వెంకట నాయుడు, డాక్టర్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బీఎంఎస్ నూతన కార్యవర్గ ఎన్నిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఎం. రామస్వామి అధ్యక్షుడిగా, జెర్రిపోతుల రమణ ప్రధానకార్యదర్శిగా, గురుప్రసాద్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, రామస్వాయి కోశాధికారిగా, ఎం. పెంటారావు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మరో తొమ్మిది మందిని కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. బీఎంఎస్ వ్యవస్థాపక సభ్యుడు ఓ. హనుమంత రావు గౌరవాధ్యక్షుడిగా నియమించారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా కొన్ని అంశాలపై తీర్మానం చేశారు.

ప్రైవేటీకరణ విధానాలకే బీజేపీ మొగ్గు


భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యం అని భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. సంస్థ ప్రధాన గేటు వద్ద శనివారం సిటూ ఆధ్వర్యంలో ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. చండీఘర్‌లో విద్యుత్ ప్రైవేటీకరణ వల్ల భెల్‌లో కూడా విద్యుత్ తయారీపై ప్రభావం చూపుతందన్నారు. గతంలో భెల్‌లోని అన్ని యూనిట్లలో 60 వేల మంది ఉద్యోగులు ఉండేవారని.. ఇప్పుడు 28 వేల మంది మాత్రమే ఉన్నారన్నారు. గతంలో విశాఖపట్నం భెల్‌లో 4000 మంది ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 680 మందికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. జగన్నాథం, కె.నారపురెడ్డి, ఎస్.వి.శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

సింటర్ ప్లాంట్ ఘటనలు పునరావృతం కాకూడదు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణమే యాజమాన్యం చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విభాగాధిపతి మొహంతితో ప్రమాదం జరిగిన తీరు.. భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. ఆయన మాట్లాడుతూ మెయింటెనెన్స్, క్లీనింగ్ లేకపోవడం వల్ల గ్యాలరీ బరువు పెరిగి కూలిపోయిందన్నారు. అదృష్టవశాత్తు ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడం వల్ల ఎటువంటి ప్రాణాపాయం వాటిల్లలేదన్నారు. ఇకనైనా యాజమాన్యం చర్యలు తీసుకొని మరే ఇతర యూనిట్లు, విభాగాల్లో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగం కన్వీనర్ డి.వి.కె. రాజు, ఎస్.ఎ. నాయుడు, కె.వి.డి. ప్రసాద్, రాంబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


సింటర్ విభాగంలోని ప్రమాద స్థలాన్ని సందర్శించిన రాజశేఖర్, నాయకులు

సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనంజయరావు శనివారం కార్యాలయంలో ఆవిష్కరించారు. విభాగ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా అడ్వాన్సెస్ ఇన్ జియో ఫిజిక్స్ ఫర్ ఏ సస్టైనబుల్ ఫ్యూచర్ ఎనర్జీ, ఎన్విరాన్మెంట్ అండ్ నేచురల్ రిసోర్సెస్ అనే అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, విభాగాధిపతి ఆచార్య సీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.